మహాత్మాగాంధీకి నివాళి

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆయా డివిజన్లలో గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు.
- జోన్ బృందం, (ఆంధ్రజ్యోతి)



ఎంఐజీకాలనీలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భారతీనగర్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్ రెడ్డి, కాలనీ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు



కేపీహెచ్‌బీకాలనీలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు సత్యం, తూము వేణు, ప్రతాప్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు



రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీ నగర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రాఘవులు, ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, సభ్యులు



మాదాపూర్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, స్కూల్ సిబ్బంది



చందానగర్ జనసేన పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



● జీడిమెట్ల పారిశ్రామికవాడ ఫేజ్-2లో ఓ అట్టల పరి శ్రమ వద్ద మినీ ట్రాన్స్‌పోర్టు లారీలో సరిపడ లోడ్ కన్నా అధికంగా నింపుతుండడంతో ఏప్రమాదం సంబవిస్తుందోనని ఈ రోడ్డున వెళ్లే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.
- షాపూర్‌నగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి)

షార్ట్ సర్క్యూట్‌తో ప్రైవేట్ బస్సు దగ్ధం



కాలిపోయిన బస్సు

జీడిమెట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పార్కుచేసిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు అంటుకుని బస్సు దగ్ధమైంది. ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణహాని కాలేదు. సూరారం ఆర్కే ట్రాన్స్‌పోర్టుకు చెందిన బస్సులను షాపూర్‌నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలోని హెచ్‌ఎంటీ స్థలంలో పార్కింగ్ చేస్తుంటారు. మంగళవారం ఉదయం ఒక్కసారిగా బస్సు నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే జీడిమెట్ల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇస్తే సకాలంలో వారు రాకపోవడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనపై జీడిమెట్ల సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల బస్సులో బ్యాటరీ మార్చారని, దానికి నూతన వైరింగ్ చేసినట్టు యాజమాన్యం చెప్పిందిన, తాము ఎలాంటి కేసు పెట్టమని యాజమాన్యం చెప్పినట్టు వెల్లడించారు. మంటలను అదుపు చేకపోయినట్టయితే పక్కనే ఉన్న మరో ఐదు బస్సులు కూడా కాలిపోయేవని తెలిపారు. మంటలు అదుపు కావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు మాత్రం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం తయారీ.. వ్యక్తి అరెస్టు

చందానగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తయారు చేసి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, అతడి నుంచి 30 లీటర్ల 29 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు, శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా రూట్‌వాచ్ నిర్వహించారు. చందానగర్ బస్టాస్ వద్ద సుమన్‌కృష్ణ అక్రమంగా ఇంటి వద్ద మద్యం తయారు చేసి లీటర్ సీసాలో పోసి వాటిని రూ.850కు అమ్ముతుండగా అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఇంటి వద్ద తయారు చేసిన 30లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపులు మూసివేయాలి

జీడిమెట్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో అక్రమంగా నడుపుతున్న బెల్టుషాపులను తక్షణమే మూసివేయాలని కార్పొరేటర్ కె.జగన్ మంగళవారం జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెల్టుషాపుల వల్ల మహిళలు ధైర్యంగా రోడ్డు మీద తిరగలేకపోతున్నారని, తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని బెల్ట్‌షాపులను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహముదిరాజ్, బాలు, సంతోష్, యాదగిరి, సంపత్ రెడ్డి, సునీల్, విఘ్నేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు



మియాపూర్ బొల్లారం రోడ్డులో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లడంతో మంగళవారం ఉదయం దాదాపు రెండుగంటల పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. మురుగునీరు ప్రధాన రహదారిపైకి రావడంతో రహదారి బురదమయంగా మారింది. రామసముద్రం కుంట కల్వర్టు ప్రాంతం లోతట్టు ప్రాంతంగా ఉండటంతో ఆ రోడ్డుపై మురుగునీరు పరుగులు తీసింది. దీంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. స్థానికుల సమాచారంతో తాత్కాలికంగా మురుగునీటిని నిలిపివేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.
- మియాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి)

కబ్జా చేస్తున్నారు!

● ప్రభుత్వ ఖాళీ స్థలాలకు రక్షణ కరువు
● సొంత స్థలంగా ప్రకటించుకుంటూ పైరవీలు
● రెవెన్యూ అధికారులకు లక్షల్లో ముడుపులు!



గోపన్‌పల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శంకర్ (ఫైల్)

రాయదుర్గం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలంలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువైంది. ఈ ప్రాంతం ఐటీ కంపెనీలకు కేంద్రంగా మారడంతో భూముల ధరలు కోట్లు పలుకుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు భూ కబ్జాదారులు వాలిపోతున్నారు. భూములను కబ్జా చేసేస్తున్నారు. ముఖ్యంగా ఖాజాగూడ సర్వేనెంబర్ 28, గచ్చిబౌలి సర్వే నెంబర్ 91, 34,36, గోపనపల్లి గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 34, 36, 37లలో కబ్జాదారులు రాత్రికి రాత్రి కబ్జా చేస్తున్నారు. ఈ భూములు కోట్ల రూపాయల విలువ చేస్తుండటంతో కబ్జా దారులు రెవెన్యూ అధికారులకు లక్షల్లో ముడుపులు చెల్లించేందుకు వెనకాడటం లేదంటూ ఆరోపణలు వస్తున్నాయి. ఖాజాగూడ గ్రామ పరిధిలోని 28, 27 సర్వేనెంబర్లలోని భూమిని కొందరు ఎలాంటి నిర్మాణాలు చేపట్టక పోయినా తమ సొంత స్థలంగా ప్రకటించుకుంటూ ఏకంగా 59 జీఓ కింద దరఖాస్తు చేసుకొని పైరవీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. గతంలో ఈ స్థలాన్ని మోడల్ మార్కెట్‌కు కేటాయించిన రెవెన్యూ అధికారులు కొన్ని కారణాలతో భవనాలు నిర్మించలేదు. ఖాళీగా ఉన్న ఈ స్థలాలను 59 జీవో కింద క్రమబద్ధీకరించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే గోపనపల్లిలోని సర్వేనెంబర్ 34లోని ప్రభుత్వ భూమిలో ఏకంగా ఎక్స్‌కవేటర్లు పెట్టి లెవలింగ్ పనులు చేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో స్థానికులతోపాటు ఇతర మండలాలకు చెందిన వారు వచ్చి హద్దులను ఏర్పాటు చేసుకొని తమ స్థలం అంటూ చెప్పుకుంటున్నారనంటే భూకబ్జాలు ఏ స్థాయిలో కొనసాగుతున్నాయో అర్థమవుతోంది. గతంలో గోపనపల్లి తండా ప్రాంతంలోని పెద్ద చెరువు శిఖం స్థలాన్ని సైతం కబ్జా దారులు వదల్లేదు. ఇరిగేషన్ అధికారులు వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి కబ్జాలకు పాల్పడ్డారు. కబ్జా చేసిన స్థలంలో ఓ గది నిర్మించి కరెంటు మీటర్, ఇంటి నెంబర్ తెస్తున్నారు. 100 గజాల స్థలానికి సుమారు రూ.35 లక్షల నుంచి రూ. 50లక్షల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు పలు కారణాలను చూపుతూ నిశ్చేష్టులై ఉండిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శేరిలింగంపల్లిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



గౌడ కులస్థుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

పేట్‌బషీరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్‌లో గౌడ కులస్థుల సమస్యలు పరిష్కరించాలని గౌడ సభ్యులు కోరారు. మంగళవారం సంఘ సభ్యులు దండమూడి ఎన్‌క్లేవ్‌లో నివాసముండే ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గౌడ సంఘ సంక్షేమ భవన నిర్మాణం, కుత్బుల్లాపూర్ గ్రామంలో కల్లు సొసైటీలో ఉన్న ప్రతి మెంబర్‌కి ప్రతి సంవత్సరం రూ. 50వేల నగదు ఇవ్వాలని, సొసైటీలో 18 సంవత్సరాలు నిండిన వారికి మెంబర్ షిప్ ఇవ్వాలని, కుటుంబ సభ్యుల్లో ఏ వ్యక్తి మరణించినా కల్లు సొసైటీ నుంచి రూ. 50వేలు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘ అధ్యక్షుడు కూన రాజ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్య క్షులు గణేష్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, యాస్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సందీప్, శ్రావన్, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో సైబర్ క్రైం డీసీపీ శిల్పవల్లి, కళాశాల నిర్వాహకులు

కూకట్‌పల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువతీ, యువకులు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ సైబర్‌క్రైం డీసీపీ శిల్పవల్లి అన్నారు. జేపీనగర్‌లోని విశ్వనాధ గార్డెన్స్‌లో మంగళవారం కేపీహెచ్‌బీకాలనీకి చెందిన ప్రగతి ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరం మేరకు వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు రవీందర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి హరికథా మహోత్సవం

రవీంద్రభారతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కళాపోషకుడు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కేవీ.రమణాచారి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హరికథా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మద్దాళి రఘురామ్ తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నగరంలోని నల్లకుంట శృంగేరి మఠం వేదికగా ఈ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రారంభించనున్నారు. మొదటి రోజు డా.సప్పాభారతి శివలీలలు హరికథాగానం, తార్వత రోజుల్లో ఎర్రా శ్రీనివాస్ -గజేంద్రమోక్షం, ఆర్.రేఖ - వినాయక విజయం, మడమల రాంబాబు - మహా కవికాళీదాసు, జల్దా విశ్వనాథ జయరాములు - శ్రీనివా కళ్యాణం, జె.జె.నారాయణ - భక్త మార్కండేయ, గరిమెళ్ల సత్యవతి చే సీతారామ కళ్యాణం హరికథాగానం చేయనున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు హరికథాగానం ప్రారంభమవుతుందని రఘురామ్ తెలిపారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

● తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

పంజాగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని, లేకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఆయన ఇంటిని ముట్టడిస్తామని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జెల కాంతం హెచ్చరించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకుడు డాక్టర్ సంజీవ్ నాయక్‌తో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రాజెక్టుల పేరుతో వేల కోట్లు దోచుకొన్నారని ఆరోపించారు. ప్రజలు కలిసికట్టుగా పోరాటం చేస్తేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. తెలం గాణ పేరు మీద పార్టీ పెట్టుకుని పబ్బం గడిపి పదవులు అనుభవించారన్నారు.

సురేందర్‌కు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న గడ్డం శ్రీరామ్

పంజాగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమం సమయంలో పోలీస్ శిక్షణలో జై తెలంగాణ అంటూ నినాదం చేసి ఉద్యోగం పోగొట్టుకున్న జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ఉద్యమకారుడు ఎస్.సురేందర్‌కు న్యాయం చేయాలని, అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ జనరల్ స్టూడెంట్ జేఏసీ (ఓయూ) అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తనతో పాటు సురేందర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ చదివాడని, తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడన్నారు. ఉద్యమ సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో 2009లో వెలువడిన పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై కర్నూలులో శిక్షణ పొందుతున్న సమయంలో జై తెలంగాణ అంటూ నినాదాలు చేయడంతో అధికారుల ఆగ్రహానికి గురై ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం, మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులకు ఎన్ని లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మానవతా దృక్పథంతో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి సురేందర్‌కు ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేఏసీ కన్వీనర్ విమల్‌కుమార్, నాయకులు సుధీర్, గోపి, శివ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నిధుల కొరత ఉంది



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం రసాబాసగా మారింది. మేయర్ కొలన్ నీలారెడ్డి అధ్యక్షతన మంగళవారం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో 21వ సాధరణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే స్వచ్ఛ్ సర్వేక్షన్ 2023 అవార్డు పొందినందుకు గానూ కార్పొరేషన్ ప్రజా ప్రతి నిధులు నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం పారిశుధ్యం, ఆరోగ్యం వంటి ప్రతి పాదనలతో పాటు డివిజన్‌ల వారీగా చేపట్టబోయే అభివృద్ధి నిధుల విషయంలో కార్పొరేటర్లు ఒక్కసారిగా, కార్పొరేషన్ అభివృద్ధి పనులే జరగడం లేదని, ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని సభ్యులు మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సమావేశాలు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు కానీ, డివిజల్లో మాతకనం అభివృద్ధి పనులు జరుగుతున్నాయా, లేదానే విషయాన్ని మరిచిపోయారని అన్నారు. ఇండిపెండెంట్ కార్పొరేటర్లుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు మేయర్, కమిషనర్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న సమావేశం అప్పటి అధికార పార్టీ నాయకుల అండదండలతో సాగిందని, ఇక నుంచి కేవలం ప్రజా సమస్యల పరిష్కార దిశగా సమావేశాలు కొనసాగించాలని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతి నగర్ కమాన్ వద్ద నిధులు లేని కార్పొరేషన్ ద్వారా ప్రగతి నగర్ చిహ్నం ఎందుకు నిర్మించారని, ఇండిపెండెంట్ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా కోట్ల రూపాయలు వెచ్చించి అనవసరమైన వాటికి నిధులు వెచ్చించడం ఎంతవరకు సమజ్యసమని ప్రశ్నించారు. సమావేశంలో గందరగోళం జరుగుతున్న సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మేయర్ సమాదానం చెప్పలేక మిన్నకుండి పోయారు. దీంతో కమిషనర్ రామకృష్ణారావు కలుగచేసుకొని ప్రస్తుతం కార్పొరేషన్‌లో నిధులకొరత ఉందని, నూతన పనులు చేపట్టలేమని కమిషనర్ చేతులెత్తేశారు.

రచయిత్రి యలమర్తి అనురాధకు సన్మానం



యలమర్తి అనురాధను సన్మానిస్తున్న కావ్యమధనం ప్రతినిధులు

అల్లాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సాహిత్య వేదిక కావ్యమధనం వార్షికోత్సం సందర్భంగా ఇటీవల గుంటూరులో జరిగిన కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి యలమర్తి అనురాధకు సన్మానం జరిగింది. పూసపాటి కృష్ణ సూర్యకుమార్ మాట్లాడుతూ అనురాధను విశిష్ట రచయిత్రిగా, తెలుగు భాషను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్న విద్యార్థినిగా మెమొంటో, సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో చెరుపల్లి గంగావతి, పణతుల వరలక్ష్మి, తోట రాజేశ్వరి, యల్లాప్రగడ సాయి పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు



భరత్‌సింహారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

షాపూర్‌నగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్‌లోని న్యూ శివాలయనగర్‌లో జగదంబ అమ్మవారి జాతరకు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సూరారం సీఐ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు దుర్గదాస్ మహేరాజ్, నాగరాజ్, గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, చత్రునాయక్, బల్సింగ్ పవర్, సందీప్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్‌గౌడ్, సుదర్శన్, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నాచెరువు పరిశీలన



ఉప కమిషనర్ నర్సింహకు సమస్యను వివరిస్తున్న స్థానికులు

పేట్‌బషీరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని వెన్నెలగడ్డ ఎన్నాచెరువు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిసర ప్రాంతాలను కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నర్సింహ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు. ప్రభుత్వం జారీ చేసిన పట్టాలతోనే ఇళ్లు కట్టుకొని 40 సంవత్సరాలుగా ఇక్కడే నివాసముంటున్నామని స్థానికులు అధికారులకు విన్నవించారు. ఇళ్ల పత్రాలను ఆఫీసులో చూపించాలని వారికి ఉపకమిషనర్ సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ సాయిబాబా, నాయకులు జ్ఞానేశ్వర్, సజీవరెడ్డి, మణెమ్మ, దేవమ్మ, అన సూయ, అంజయ్య, బీమ్‌రావు, ప్రతాప్, లక్ష్మి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్ శేఖర్‌గౌడ్

పేట్‌బషీరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శనగర్‌లో రూ. 73 లక్షలతో చేపడతున్న భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ బి.విజయ్‌శేఖర్‌గౌడ్ పరిశీలించారు. కాలనీల్లో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, సంక్షేమ సంఘం సభ్యులు, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పీఎఫ్‌పై అవగాహన



మాట్లాడుతున్న పటాన్‌చెరు ప్రాంతీయ కార్యాలయం కమిషనర్ విశాల్ అగర్వాల్

మియాపూర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సంస్థ ఆధ్వర్యంలో మదీనగూడలోని విజేత సూపర్ మార్కెట్‌లో నిధి ఆప్‌కే నికట్ 2.0పేరుతో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి పటాన్‌చెరు ప్రాంతీయ కార్యాలయానికి చెందిన కమిషనర్ విశాల్ అగర్వాల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జీవీ రావు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యోగుల పీఎఫ్ సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ నామినేషన్, కేవైసీ, అంశాలకు చెందిన సమస్యలకు పరిష్కారాలు సూచించారు. కార్యక్రమంలో భాగంగా సదస్సుకు హాజరై పలువురు పింఛన్ దారుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ప్రావిడెంట్ ఫండ్ అధికారులు రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, రాజగోపాల్, డీజీఎం రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 11కేవీ ఏఎస్.రాజునగర్, విజయానగర్, శాంతినగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతులవల్ల విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ చైతన్య తెలిపారు. బుధవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఏఎస్‌రాజునగర్, వెంకటేశ్వరస్వామి ఆలయం పరిధిలో, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30వరకు ఎమ్మెల్యే గాంధీ క్యాంపుకార్యాలయం, వివేకానందనగర్ కాలనీలోని కాంప్లెక్ రోడ్డు, శాంతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

● **కేపీహెచ్‌బీకాలనీ:** కేపీహెచ్‌బీ విద్యుత్ సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపువల్ల బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ విద్యాసాగర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదోఫేజ్ రోజరీ స్కూల్, షటిల్ పార్కు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, విక్టరీ కాలేజ్, టెలిఫోన్ ఎక్చేంజ్, డీమార్ట్ రోడ్డు, గౌతం మోడల్ స్కూల్, మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, ఫిష్ మార్కెట్, ఎస్ఎస్ఎల్ అపార్ట్‌మెంట్స్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రవి హాస్పిటల్, ప్రసాద్ హాస్పిటల్, రోడ్డు నంబర్-1, ధనలక్ష్మీ సెంటర్, ఈడబ్ల్యూఎస్ శివాలయం రోడ్డు, ఎల్ఐజీ జీహెచ్‌ఎంసీ పార్కు, రోడ్డు నంబర్ 2అండ్ 3 ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

● **రాయదుర్గం:** వెజిటెబుల్ మార్కెట్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. లింగంపల్లి మటన్‌మార్కెట్, ఎస్ఎం లేఔట్ ప్రాంతం, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు చందానగర్ హుడాకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

● లాంకోహిల్స్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. ఖాజాగూడ, గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్, సాస్ఇన్‌ఫ్రా, సాయిఐశ్వర్య లేఔట్, సాయివైభవ్‌కాలనీ, ఓక్రిడ్జి స్కూల్, చిత్రపురికాలనీ, ఎంఐజీ, హెచ్ఐజీ, ఎల్ఐజీ, ల్యాంకోటవర్స్, అంకుర హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.



ఫర్నిచర్ అందజేసిన లక్ష్మీనాయుడిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ నిఖిత్ అంజూం

డిగ్రీ కాలేజీకి ఫర్నిచర్

ఖైల్‌కాలనీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫర్నీచర్ కొరత ఉండడంతో లింగంపల్లికి చెందిన సంఘసేవకురాలు లక్ష్మీనాయుడు మంగళవారం ఫర్నీచర్ అందజేశారు. కాలేజీకి ఆరు ఖరీదైన కుర్చీలు అందజేయగా, ఆమెను ప్రిన్సిపాల్ నిఖిత్ అంజూం సన్మానించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్, అధ్యాపకులు మురళీకృష్ణ, జానయ్య, బిక్షపతి, జ్యోతి, వరలక్ష్మీ,సిబ్బంది పాల్గొన్నారు.